గ్రాసానికి గడ్డుకాలం

పాడి రైతులకు గడ్డు రోజులొచ్చాయి. ఎండు గడ్డి కొరత తీవ్రం కావడంతో పశుపోషణ భారంగా మారుతోంది. కూలీల కొరత కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడి అయోమయంలో పడిపోయారు. అసలే వేసవి కాలం.. పశుమేతకు కష్టకాలం రావడంతో.. ధరభారమైనా.. ప్రత్యామ్నాయ దాణాలపై దృష్టి సారించారు.

పాడి రైతులకు కష్టకాలం
- కూలీల కొరతతో పశుగ్రాసం ధరలకు రెక్కలు
- యంత్రాల వినియోగంతోనే సమస్య అంటున్న రైతులు
- పశువులకు దాణాగా.. పచ్చిగడ్డి, సొప్పతో సరి
- రూ.30 వేలు పలుకుతున్న లారీ వరిగడ్డి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎండు గడ్డి

మహేశ్వరం: మండలంలోని చాలా మంది రైతులు పాడిని జీవనోపాధిగా ఎంచుకున్నారు. ఏటా యాసంగి, వానాకాలం సీజన్లలో వచ్చే వరి గడ్డిని పశువుల మేతకు రైతులు వినియోగిస్తారు. వరి సాగు చేసిన రైతులు.. కూలీలతో పంటను కోయించకుండా వరి కోత మిషన్లు(హార్వేస్టర్) ద్వారా వరి పంటలను కోయిస్తున్నారు. దీంతో వరి ఎండుగడ్డి దిగుబడి కూలీలతో కోయించినంతగా.. యంత్రాల వినియోగంతో రాదు. కొందరు రైతులు గడ్డిని పంట పొలాల్లోనే దహనం చేస్తున్నారు. మండలంలో ఇదివరకు అన్ని గ్రామాల్లో వరిని సాగు చేయడంతో గడ్డి పుష్కలంగా లభించేది. ఇప్పుడు వరిసాగు తగ్గడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వరి సాగు చేయగా.. మరి కొన్ని ప్రాంతాల్లో రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు పండించారు. దీంతో ఇక్కడి పాడి రైతులు ఇతర ప్రాంతాల నుంచి గడ్డిని లారీలు, ట్రాక్టర్లలో దిగుమతి చేసుకుంటున్నారు. గడ్డి కొరత ఎక్కువగా ఉండడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో పాడినే నమ్ముకున్న కొందరు రైతులు.. వరి గడ్డిని కొనలేక, ఎక్కువ శాతం పచ్చిమేత, సొప్ప మీదే ఆధారపడుతున్నారు.

రెట్టింపైన ధరలు...

వరిగడ్డికి ఈ సీజన్‌లో రెట్టింపు ధర పలుకుతోంది. గతంలో ఒక ట్రాక్టర్ గడ్డి రూ.6వేల నుంచి రూ.10 వేలు ఉండగా.. ఈ సీజన్‌లో రూ.10 వేల నుంచి 15 వేలు, లారీ గడ్డికి సుమారు 25 వేల నుంచి 30 వేల వరకు ఎగబాకింది. దీంతో రైతులకు వరిగడ్డి దొరకక పశుపోషణ భారంగా మారింది. దీంతో పాడి రైతులు.. ప్రత్యామ్నాయంగా సొప్ప కుట్టీ, పచ్చిగడ్డి గ్రాసంతో పాటు దాణాలను వాడుతున్నారు.

దాణా కొనలేని పరిస్థితి..

పశువుల దాణా ధరలు విపరీతంగా పెరిగాయి. శనగచెక్క, కొబ్బరిపిట్టు, పెసర పొట్టు, గోధుమ పొట్టు, పత్తి చెక్క, మినపపొట్టుతో పాటు పలు దాణా ధరలు ఆకాశన్నంటాయి. కొంత మంది పాడి రైతులు పాల నుంచి లాభాలు రాకున్నా పశువులకు అప్పు చేసి పశుగ్రాసం, దాణా పెడుతున్నారు. గతంలో పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు గడ్డి విత్తనాలు సబ్సిడీపై అందజేసేవారు. అధికారులు అక్కడక్కడా కొన్ని పంపిణీ చేసి అయిపోయాయి అని పశు ఆస్పత్రులకు వచ్చే రైతులకు చెబుతున్నారు.

ధర ఎక్కువైనా తప్పడం లేదు



ఈ సంవత్సరం వరి ఎండు గడ్డి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రోజు పశువులకు పచ్చిమేతతో పాటు కొంత ఎండుగడ్డి వేసేవాళ్లం. ఇప్పుడు ఎండు గడ్డి ధరలు పెరగడంతో కొనలేని పరిస్థితి. తప్పని పరిస్థితిలో అప్పు చేసి అధిక ధరకైనా కొనుగోలు చేసి పశువులకు మేతగా వేస్తున్నాం.

– బుర్ర బాలరాజ్, పాడిరైతు, దుబ్బచర్ల.

పశుపోషణ భారంగా మారింది



కూలీల కొరత కారణంగా వరి ఎండుగడ్డికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో ప్రత్యామ్నాయంగా సొప్ప, కుట్టీ, పచ్చిమేతతో పాటు ఇతర గ్రాసాలను పశువులకు మేతగా వేస్తున్నాం. ప్రస్తుతం దాణా ధరలు పెరగడంతో పశుపోషణ పాడి రైతులకు భారంగా మారింది. నష్టాలు వస్తున్నా నెట్టుకొస్తున్నాం.

– తిరుమల సుధాకర్, పాడిరైతు, కల్వకోల్

ఉద్యోగ భద్రత కల్పించాలి

బడంగ్‌పేట్: విద్యుత్ సంస్థలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కనీస వేతనం అమలు చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం లేబర్ కమిషనర్ సీతఃవోకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ ఎస్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో సుమారు 8 వందల మంది బిల్ కలెక్టర్లు, రెవెన్యూ క్యాషియర్లు 30 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా కష్ట సమయంలో సైతం విధులు చేశామన్నారు. అయినా కాంట్రాక్ట్ విధానంలోనే పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో సీఎం కేసీఆర్ బిల్ కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావుకు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేటికీ హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా బిల్ కలెక్టర్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

ఎంపీ కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు చెందిన నాయకుడు చెరుకు సుధాకర్‌ను చంపుతానని బెదిరించడం సరికాదని ఖండించారు. ఆయన రౌడీయిజానికి పాల్పడితే భయపడేది లేదని హెచ్చరించారు. ఇలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్ సభను సక్సెస్ చేయాలి

బడంగ్‌పేట మేయర్ పారిజాతరెడ్డి



కరీంనగర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క, మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఈ నెల 9న కరీంనగర్ స్టేడియంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి కాంగ్రెస్ శ్రేణులను కోరారు. సోమవారం కరీంనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ములుగు ఎమ్మెల్యే సీతక్క ఇతర ముఖ్య కాంగ్రెస్ నాయకులతో పారిజాతరెడ్డి సమావేశమయ్యారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్ల కోసం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం కరీంనగర్‌లోని అంబేడ్కర్ గ్రౌండ్ సభ స్థలిని సీతక్క, పొన్నంతో కలిసి పరిశీలించారు. అనంతరం పారిజాతరెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మహేశ్వరం నియోజకవర్గంలోని మండలాలు, డివిజన్లు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు.

రాజకీయమే వృత్తిగా స్వీకరించాలి

- జీసీ, ఎస్సీ, ఎస్టీలను విడగొట్టి పాలిస్తున్నారు
- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

మహేశ్వరం: అగ్రకుల పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బీసీ, ఎస్సీ, ఎస్టీలను ముక్కలుగా విడగొట్టి పాలన సాగిస్తున్నారని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ ఆరోపించారు. సోమవారం రాత్రి విశారదన్ పాదయాత్ర తుమ్మలూరు నుంచి మహేశ్వరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లతో 10 శాతం మంది లేని అగ్రవర్ణ కులాలు రాజ్యాన్ని పాలిస్తూ బహుజనులను బానిసలుగా చేస్తున్నారన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడవడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యావంతులు రాజకీయమే తమ వృత్తిగా స్వీకరించాలన్నారు. రైతులను రాజు చేయడమంటే అగ్రకులాల రైతులు రాజులు కావడం కాదని, భూమిపై తమ రక్తాన్ని స్వేదాన్ని చిందించే బహుజన రైతులను రాజు చేయడానికే డీఎస్పీ లక్ష్యమని తెలిపారు. ఈ పాదయాత్ర అగ్రకులాల పార్టీల నాయకులని తిట్టడం కోసం కాదని, అణగారిన కులాలకి సామాజిక రాజకీయ జ్ఞానాన్ని నేర్పించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. రంగారెడ్డి జిల్లా మొత్తం రెడ్ల ఆధీనంలో ఉందని, భూమి మొత్తాన్ని ఆక్రమించారని ఆరోపించారు. డీఎస్పీ తీసుకొచ్చే అణగారిన కులాల రాజ్యాధికారంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అత్యాధునికమైన వైద్యశాలలను కట్టించి, ఉచిత విద్యను అందిస్తూ ఉపాధిని కల్పిస్తూ ప్రతి కుటుంబానికి సౌకర్యవంతమైన ఇల్లు కట్టిస్తామన్నారు. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి ఓటు హక్కును కల్పించారన్నారు. జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, కాన్షీరామ్ బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, జిల్లా నాయకులు జంగయ్య, మండల అధ్యక్షుడు పి.దేవేందర్,నాయకులు ఆకాష్, రవి, రాము, అశోక్, అనిల్, శేఖర్, బీసీ నాయకులు సురేష్ గౌడ్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో ప్రసిద్ధిగాంచిన వాసవి కాలనీ అష్టలక్ష్మీ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం అష్టలక్ష్మీ దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్ర శేఖర్ గుప్తా సమక్షంలో సోమవారం అష్టలక్ష్మి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, అక్షయ ట్రస్ట్ సెక్రటరీ మద్యాం సుధాకర్ గుప్తా, మాజీ చైర్మన్ దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అష్టలక్ష్మి ఆలయానికి మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. దేశంలో ప్రసిద్ధి ఆలయంగా తీర్చిదిద్దాలని కోరారు. దేవాలయ చైర్మన్ సోమా సురేష్, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య గుప్తా, వైస్ చైర్మన్ నగమల్ల శ్రావణ్, సెక్రటరీలు వనం యాదయ్య, దాచేపల్లి శ్రీనివాస్, పొద్దుటూరి నరసింహారావు, ప్రత్యేక ఆహ్వానితులుగా చిలుక ఉపేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఉమాపతి రావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజ్

ఆమనగల్లు/తలకొండపల్లి: మాణిక్‌రెడ్డి గెలుపుతోనే విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమవుతాయని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భగవంత్ రాజ్ అన్నారు. సోమవారం ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి మద్దతుగా సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టకపోవడం వల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు.ప్రభుత్వం కోర్టు కేసుల విషయంలో చొరవ తీసుకుని వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాములయ్య, నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు, సురేశ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు



కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: ఈనెల 5న సాక్షి దినపత్రికలో కుక్కలున్నాయి జాగ్రత్త అనే శీర్షికన వచ్చిన వార్తకు సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలోని వీధులు, రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న వీధి కుక్కలను గుర్తించి వాటి నివారణ కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

కాముడి దహనం



కందుకూరు చౌరస్తాలో కాముడి దహనం చేస్తున్న యువకులు

కందుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి కాముడి దహనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ముందు రోజు కాముని దహనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాముడి దహనంలో చిన్న, పెద్ద సంతోషంగా పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఉద్యోగిని దుర్భాషలాడిన వ్యక్తి అరెస్ట్

చైతన్యపురి: జీహెచ్ఎంసీ ఉద్యోగిని ఫోన్‌లో దుర్భాషలాడిన ఓ వక్తిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... సత్యనారాయణ అనే జీహెచ్ఎంసీ బిల్ కలెక్టర్ ఆస్తిపన్ను వసూలు కోసం మార్గదర్శి కాలనీలోని ఓ వాషింగ్ సెంటర్‌కు వెళ్లారు. రెసిడెన్షియల్ టాక్స్ బదులు కమర్షియల్ ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని అక్కడ వాషింగ్ సెంటర్‌కు చెందిన మహిళతో చెప్పారు. దీంతో ఆమె నోటీసు ఇచ్చి వెళ్లండి అని చెప్పింది. ఇదే విషయాన్ని ఫోన్‌లో ఆ మహిళ తనకు తెలిసిన సోమిరెడ్డికి చెప్పింది. దీంతో సోమిరెడ్డి బిల్ కలెక్టర్ సత్యనారాయణకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. దీనిపై యూనియన్ నాయకులతో వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చిన్నారిపై అసభ్యకర ప్రవర్తన

వృద్ధుడి అరెస్ట్

చైతన్యపురి: ఓ చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వృద్ధుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ సమాచారం మేరకు... చైతన్యపురి పరిధిలోని ఓ కాలనీలో వెంకట్‌రావ్(81) అనే వృద్ధుడు ఇంటి సమీపంలోని ఓ ఎనిమిది సంవత్సరాల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికుడు బాలిక కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నూతన రోడ్లతో ప్రయాణ కష్టాలు దూరం



పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్లు శంకర్, భాషమ్మ

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ, బీటీ రహదారులతో శ్రీరాం కాలనీ ప్రజలకు రవాణా ఇబ్బందులు తప్పనున్నాయని జల్‌పల్లి మున్సిపాలిటీ 19, 20 వార్డుల కౌన్సిలర్లు పల్లపు శంకర్, భాషమ్మ అన్నారు. శ్రీరాం కాలనీలో రూ.1.30 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్డు పనులను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి కృషితోనే శ్రీరాం కాలనీలో రోడ్లకు మహర్దశ పట్టుకుందన్నారు. గతేడాది రూ.50 లక్షల వ్యయంతో మధుబన్ కాలనీ వెళ్లే రూట్‌లో సీసీ రోడ్డు వేశామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మారుతి పాల్గొన్నారు.

తిరు కల్యాణంలో బీజేపీ నేతలు



బండి సంజయ్, బొక్క నర్సింహారెడ్డిని సన్మానించిన పార్టీ నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ (ఈ-సిటీ) ఆదిలక్ష్మి అలివేలు మంగా సమేత బాలజీ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గర్భాలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు బోధ యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, బాకి విలాస్, నాయకులు కాటం భాస్కర్‌గౌడ్, కొప్పుల శివయ్య, జాపాల సుధాకర్, మదన్‌మోహన్, నర్సింగ్, శ్రీనివాస్‌నాయక్, కృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్ యాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ న్యూమారుతీనగర్ కాలనీ ఆనుకుని ఉన్న మూసీ నది పరీవాహక ప్రాంతంలో గంజాయి సేవిస్తూ స్థానికంగా ఇబ్బందులు కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకావాలని కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా పోలీసు సిబ్బందిని కోరారు. న్యూమారుతీనగర్ సౌత్ కాలనీలో సోమవారం రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించేందుకు వెళ్లిన కార్పొరేటర్‌కు కొందరు గంజాయి సేవిస్తున్న విషయంపై ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చైతన్యపురి పోలీసులను పిలిపించారు. గంజాయి సేవించే వారిని పట్టుకోవాలని సూచించారు. స్థానిక నేతలు ఉపేందర్, శివకుమార్, అంజిబాబు, ఆనంద్, జగదీష్, రవికుమార్, కమల్, చలపతిరావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యను పోలీసులకు వివరిస్తున్న కార్పొరేటర్ నర్సింహ గుప్తా

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



కంటి వెలుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. చైతన్యనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... కంటి పరీక్షలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు ముదుపు సందీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు చేయూత



రేషన్ అందజేస్తున్న రఘుకుమార్, విజయలక్ష్మి దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌కు చెందిన రఘుకుమార్ ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 40 వేల విలువైన రేషన్ సరుకులను గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ మాట్లాడుతూ... అమెరికాలో ఉన్న వారి కుమారుడు జగదీశ్వర్ సాయికృష్ణ కోడలు నిఖితల పెళ్లి రోజు సందర్భంగా రేషన్‌ను అందజేశామన్నారు. ఐదేళ్లుగా రఘుకుమార్– విజయలక్ష్మి దంపతులు కొడుకు, కోడలు జగదీశ్వర సాయికృష్ణ-నిఖితల పెళ్లి రోజు వేడుకలు అనాథ విద్యార్థి గృహంలో జరుపుతూ రూ. 40 వేల రేషన్‌ను అందజేస్తున్నారని, అందుకు రఘుకుమార్ దంపతులకు అధ్యక్షుడు మార్గం రాజేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

మహిళల భద్రతకే షీ టీం



మాట్లాడుతున్న ఏఎస్ఐ రాజేందర్

మీర్‌పేట: మహిళల భద్రత కోసమే షీటీం బృందం పనిచేస్తోందని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మీర్‌పేట మహిళా శక్తి భవన్‌లో లియో కేర్ ఫౌండేషన్ సహకారంతో షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఏఎస్ఐ రాజేందర్ మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే ప్రభుత్వం షీటీం ఏర్పాటు చేసిందన్నారు. ఏ ఆపద వచ్చినా డయల్ 100 లేదా, 9490617111 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఈవ్ టీజర్స్ నుంచి ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్‌పర్సన్ లత, వైస్ చైర్‌పర్సన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దళిత మోర్చా నేత శ్రవణ్‌కుమార్



ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ కాపీలను అందజేస్తున్న శ్రవణ్‌కుమార్

మీర్‌పేట: కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకులు శ్రవణ్‌కుమార్ సూచించారు. మీర్‌పేట కార్పొరేషన్ పార్టీ ఉపాధ్యక్షుడు స్వామికుమార్ ఆధ్వర్యంలో లెనిన్‌నగర్‌లో సోమవారం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. లెనిన్‌నగర్ ప్రాంతంలో దాదాపు 600లకు పైగా తెల్లరేషన్‌కార్డు దారులకు ఆన్‌లైన్ ద్వారా ఆయుష్మాన్ భారత్‌కు దరఖాస్తు చేయించామన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సోమేశ్వర శివాలయంలో కొనసాగుతున్న పూజలు

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలో సోమేశ్వర శివాలయంలో సోమవారం నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నూతనంగా నవ గ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. దంపతులు హోమాలు, పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది అరుణరమేశ్, ఉప సర్పంచ్ బి.నర్సింహ యాదవ్, మాజీ సర్పంచ్ మల్లేశ్ యాదవ్, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

342 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని అంతారం, పడకల్ కంటి వైద్య శిబిరాల్లో సోమవారం 342 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన వారు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కల్పన, స్నేహ, సైదమ్మ కోరారు. దృష్టి లోపాలున్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్, హెచ్ఎ మల్లయ్య, రామచంద్రయ్య, నర్సింహ, రవి కుమార్, శివకుమార్, నాగమల్లీశ్వరి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవునిపడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థాన ఆలయంగా ప్రసిద్ధి చెందడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సోమవారం ఆలయంలో వేంకటేశ్వర స్వామికి అభిషేకం, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు, చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, లక్ష్మయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి, స్వామి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.